

టీటీడీకి మొబైల్ ఫాస్ట్ ఫుడ్ వాహనం బహూకరణ



ప్రజాశక్తి - తిరుమల: తిరుమల శ్రీవారికి శుక్రవారం బెంగళూరులోని ఎం.ఎస్. రామయ్య విద్యా సంస్థలకు చెందిన ఎం.ఎస్.సుందర్ రామ్ అనే భక్తుడు అన్న ప్రసాదాలు భక్తులకు పంపిణీ చేసేందుకు రూ.14 లక్షల విలువైన అశోక్ లేల్యాండ్ కంపెనీకి చెందిన బడా దోస్త్ మొబైల్ ఫాస్ట్ ఫుడ్ వాహనాన్ని విరాళంగా అందించారు. దీంతో పాటు టీటీడీ శ్రీ వెంకటేశ్వర గో సంరక్షణ ట్రస్టుకు రూ.10లక్షలు విరాళం అందించారు. ఈ మేరకు దాత శ్రీవారి ఆలయం ముందు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి వాహన తాళాలు, డీడీని అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో లోకనాథం, డిఐ వెంకటాద్రి నాయుడు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరుల పెన్ డౌన్

- రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు
- ఆగిన రిజిస్ట్రేషన్లు
- నేడూ కొనసాగనున్న నిరసన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు లేఖకులు, స్టాంపు వెండర్లు తమ డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా 'పెన్ డౌన్' కార్యక్రమం చేపట్టారు. ఈ నేపథ్యంలో తిరుపతి బాలాజీ జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద శుక్రవారం దస్తావేజు లేఖకులు నిరసన చేశారు. ఈ నిరసన శుక్ర, శనివారాలు రెండు రోజులు పాటు కొనసాగనుంది. స్టాంపు వెండర్స్ లేఖకులు లేదా వృత్తిదారులు తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తూ కార్యాలయాలకు హాజరైనా పనులు చేయకుండా ఉండే నిరసన కార్యక్రమం అని దస్తావేజు లేఖకులు తిరుపతి అధ్యక్షులు ఎస్ భావజాన్ తెలిపారు. రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన కొన్ని విధానాల వలన అనగా ఆ ఓ.టి.పి, స్థానిక సంస్థల డేటా బేస్ ఆధారంగా ఆస్తుల రిజిస్ట్రేషన్లు. సంబంధిత కార్డ్ ప్రైమ్ 2.0 సాఫ్ట్వేర్లోని సాంకేతిక లోపాలతో దస్తా తయారీ అనేది జటిలమవుతూ తీవ్ర జాప్యానికి గురవుతున్నందున రైతులు, రియల్ వ్యాపారులు, ప్రజలు, దస్తావేజు లేఖరులు చాలా విలువైన సమయాన్ని చేసుకోవాలిసిన పరిస్థితులు ఎదురవుతున్నందున, సదరు విధానాలలో మార్పు అవసర ప్రభుత్వానికి నివేదిస్తూ దస్తావేజుల లేఖర్లు పెన్ డౌన్ చేసి నిరసన తెలిపినట్లు వెల్లడించారు. ఓ.టి.పి.లు సరి పోవడం లేదు. కస్టమర్ల ఓ.టి.పి.లు చెప్పటకు భయపడుచూ సహకరించడం లేదు. స్టాంపులకు సంబంధించి సీరియల్ నెంబర్లను పి.డి.ఇ.లో ఎంట్రీ చేయడం కష్టతరం, ఒకవేళ ఎంట్రీ చేసిన తరువాత ఏదేని ఎడిట్ చేయవలసినంతట సీరియల్ నెంబర్ల ఎంట్రీలు పనిచేయక మరల అధనపు ఖర్చుతో కొత్త స్టాంపులు తీసుకొని పి.డి.ఇ. చేయాలి. పి.డి.ఇ.లో చిన్న చిన్న తప్పిదాలకు ఎడిట్ ఆప్షన్లు లేవు. భూమికి సంబంధించి ఒక సర్వే నెంబరులోని విస్తీర్ణాన్ని ఒకరికి తప్ప, ఒకేసారి ఇద్దరికి, ముగ్గిరికి వగైరా రిజిస్ట్రేషన్లు చేయుటకు కుదరడం లేదని తెలిపారు. వృద్ధులకు బయో మెట్రిక్ ఫింగర్ ప్రింట్స్, ఐరిస్లు పనిచేయక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ పెన్ డోన్ కార్యక్రమంలో ఆ సంఘం వైస్ ప్రెసిడెంట్ ఎన్ దేవరాజులు రెడ్డి, కార్యదర్శి ఎం మాధవరావు పాల్గొన్నారు.



తిరుపతి రిజిష్ట్రార్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న లేఖరులు

ప్రజాశక్తి - పాకాల : రాష్ట్ర వ్యాప్తంగా దస్తావేజు లేఖరుల నిరసనలో భాగంగా పాకాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం లేఖరులు నిరసన కార్యక్రమం చేపట్టారు. దీంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా లేఖరులు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖలో కొత్తగా ప్రవేశపెట్టిన ఆధార్ ఓటిపి, స్థానిక సంస్థల డేటాబేస్ ఆధారంగా ఆస్తుల రిజిస్ట్రేషన్లు, రిజిస్ట్రేషన్ శాఖ సంబంధించిన కార్డు ఫ్రేమ్ 2.0 సాఫ్ట్వేర్లో సాంకేతిక లోపాలు నానాటికి జటిలమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జాప్యం వల్ల రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రజలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే నూతన విధానంలో మార్పులు తీసుకురావాలని వారు కోరారు. శుక్ర, శని వార్లాల్ల తాము పెన్ డౌన్ తో నిరసన తెలుపుతున్నామన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు రిజిస్ట్రారు వారి కార్యాలయంలో దస్తావేజు లేఖకులు శుక్రవారం పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించారు. రిజిస్ట్రార్ ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ నాగ శ్వేతకి వినతి పత్రం అందజేసి, తమ సమస్యలను పై అధికారుల దృష్టికితీసుకెళ్లి పరిష్కరించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో రాజేంద్ర నాయుడు, ఆర్ముగం, శ్రీనివాసులు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చంద్రగిరి: శనివారం చంద్రగిరి సబ్ రిజిస్టర్ కార్యాలయం ముందు దస్తావేజు లేఖరులు శాంతియుతంగా పెన్ను డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దస్తావేజు లేఖర్ల సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు శిరీస్ రెడ్డి మాట్లాడుతూ, రిజిస్ట్రేషన్ సిస్టంలో ఆధార్ ఓటిపి పెట్టడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. కార్డు ప్రైమ్ 2.0 విధానములో ప్రభుత్వం మార్పులు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ నాయకులు, గోపి, శ్రీనివాసులు, చంగల్ రాయలు, శ్రీకాంత్, భాస్కర్, మల్లి, శేఖర్, కర్ణం శ్రీనివాసులు, డాక్యుమెంట్ వేండర్స్ సిద్దయ్య నాయుడు, ఉష, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: దస్తావేజుల తయారీలో ఓటిపి విధానాన్ని రద్దు చేయాలని, చెక్ స్లిప్ ఎడిట్ ఆప్షన్ పునరుద్ధరించాలని డాక్యుమెంటు రైటర్లు, స్టాంపు వెండర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక శ్రీకాళహస్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. ఈకార్యక్రమంలో దస్తావేజుల లేఖరులు ఉమా మహేశ్వరరావు, చంద్ర సూర్యప్రకాష్, శ్యామరాజ్ ,హేమకుమార్, గుర ప్రసాద్, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-సేవ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

- మంత్రి నారా లోకేష్ హామీని అమలుపరచాలి



ఈ సేవ ఉద్యోగుల అభ్యర్థన దీక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి

ప్రజాశక్తి - తిరుపతి సిటి : తొలగించిన 607 మంది 'ఈ' సేవ ఉద్యోగులను మంత్రి నారా లోకేష్ హామీ మేరకు తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి డిమాండ్ చేశారు. శుక్రవారం కొర్లగుంట సమీపంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద అభ్యర్థన దీక్ష పేరిట ఆరు జిల్లాలకు చెందిన ఈ సేవ ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. యువగళం పాదయాత్ర సందర్భంగా మంత్రి నారా లోకేష్ ఈ సేవ ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించారని, అధికారంలోకి వచ్చిన వెంటనే తొలగించిన అందర్నీ ఉద్యోగాల్లోకి తీసుకుంటామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నా ఈ హామీ అమలుకు ప్రభుత్వం పూనుకోలేదని, పలుమార్లు విజ్ఞప్తులు చేస్తున్నా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. తక్షణం వీరి సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున చేపట్టే పోరాటాలకు సిఐటియు ప్రత్యక్ష మద్దతును తెలియజేస్తుందని కందారపు మురళి ప్రకటించారు. ఏపీ మీసేవ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ తాము ప్రభుత్వ పథకాలు నడపడానికి, ప్రభుత్వానికి రావలసిన బాకీలు వసూలు చేయించడంలోను కీలకపాత్ర వహిస్తున్నామని, ఒకరకంగా ప్రభుత్వ నిర్వహణలో తమ పాత్ర అత్యంత కీలకంగా ఉందన్నారు. వందల కోట్ల రూపాయలు ప్రభుత్వానికి రావలసిన మొత్తాలను వసూలు చేసి పెడుతుంటే తమపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం న్యాయం కాదన్నారు.

వేతన సంఘాన్ని నియమించండి

- తిరుపతి రైల్వే స్టేషన్ వద్ద ఆల్ ఇండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ నిరసన



సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో రైల్వే కార్మికుల నిరసన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: కేంద్ర ప్రభుత్వం ఎనిమిదవ వేతనం సంఘాన్ని నియమించడంలో చేస్తున్న జాప్యానికి నిరసిస్తూ శుక్రవారం తిరుపతి రైల్వే స్టేషన్‌లో ఆల్ ఇండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో భాగంగా సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్, తిరుపతి జనరల్, టెక్నికల్ శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతి లోని వివిధ కార్యాలయాల ఎదుట అనేక మంది కార్మికులతో ఎర్ర జెండాలను చేత పట్టి వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలని నిరసన చేసినట్లు ఆ సంఘం అధ్యక్షులు ఈశ్వరయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎనిమిదవ వేతన సంఘ సిఫార్సులు జనవరి 1, 2026 సంవత్సరం నుండి అమలు కావలసి ఉన్నా, ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం ఎటువంటి సంఘాన్ని ఏర్పాటు చేయక పోవడము శోచనీయమని, వేతన సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేసి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలని కోరారు. ఎంపీలకు, ఎమ్మెల్యేలకు ఎటువంటి వేతన సంఘాన్ని ఏర్పాటు చేయకుండా ఎప్పుడు పడితే అప్పుడు కాల నిర్దిష్టత లేకుండా జీతాలు పెంచుకొంటున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ కార్మికులకు ప్రతి అయిదు సంవత్సరాలకు ఒకసారి వేతనాలు పెంచు తున్నారు. మరి కేంద్ర ప్రభుత్వ కార్మికులకు అయితే పది సంవత్సరాలకు ఒకసారి వేతన సంఘాన్ని ఏర్పాటు చేసి, నివేదిక సమర్పించిన తరువాత ప్రభుత్వానికి అంగీకారంగా లేకుంటే దానిని సవరించి, కార్మిక సంఘాలతో కనీస చర్చలైనా చేయకుండా గడువు ముగిసిన తరువాత అమలు చేస్తున్నారు. ఎందుకు కేంద్ర ప్రభుత్వ కార్మికులపై ఇంత వివక్ష అని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని వేతన సంఘాన్ని ఏర్పాటు చేసి అందుకు అవసరమైన గెజెట్ నోటిఫికేషన్ ఇవ్వాలని, వీలైనంత త్వరగా పెరుగుతున్న ధరలను, రాబోవు పది సంవత్సరాలను దృష్టిలో పెట్టుకొని వేతనాలను నిర్ణయించాలని డిమాండ్ చేశా. రాష్ట్రంలోని బ్యాంకు ఉద్యోగులతో సమానంగా ప్రతి అయిదు సంవత్సరాలకు ఒకసారి కేంద్ర ప్రభుత్వ కార్మికులకు కూడా వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే కేంద్ర ప్రభుత్వము స్పందించక పోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యాక్రమంలో సెక్రటరీలు నారాయణ స్వామి, రవీంద్ర నాయక్, కోశాధికారులు మారయ్య, గౌస్ బాషా ఇతర కార్యకర్తలు వెంకటేష్ జగదీశ్, శ్రీనివాసులు అమిత్ పాశ్వాన్, శేఖర్ రెడ్డి, పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశంలో ప్రజా సమస్యలు చర్చించి, పరిష్కరించాలి : సిపిఎం

రైతులకు గిట్టుబాటు ధరకల్పించాలి
:సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్ డిమాండ్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: రైతులకు గిట్టుబాటు కల్పించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం తిరుపతి జిల్లా సిపిఎం కమిటీ సమావేశం ఆ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా మూలం రమేష్ హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో ఉల్లి, టమోటా పంటల ధర అమ్ముదామంటే చింతపండు ధర కొనుగోలు చేద్దామంటే బంగారం ధర అన్నట్లుగా పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలోని రైతులు ఉత్పత్తి ఖర్చులు పెరిగిపోతున్నా, పంటలకు గిట్టుబాటు ధర రాక తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారు. ప్రతి పంటకు కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేసి, రైతులకు ఉత్పత్తి ఖర్చులకు మించి లాభం వచ్చేలా గిట్టుబాటు ధర నిర్ధారించాలని సంవత్సరాల తరబడి డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వాల నిర్ణయాలు కేవలం పేపర్‌లకే పరిమితం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. టిటిడి పరిధిలో సంవత్సరాల తరబడి కాంట్రాక్టు ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న వారిని శాశ్వత ఉద్యోగులుగా అవకాశం కల్పించాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "స్త్రీ శక్తి పథకం" వలన ఆటో కార్మికులు నష్టపోతున్నారన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం పేరుతో ఆటో ప్రయాణికులు తగ్గి, ఆటో కార్మికులు కనీస జీవనోపాధి పొందలేని స్థితి నెలకొందని తెలిపారు. వెంటనే ఆటో కార్మికులకు ప్రతి సంవత్సరం రూ.25,000 ప్రోత్సాహకం ఇచ్చి, వారి జీవనాన్ని రక్షించాలని తెలిపారు. విశాఖపట్నం ఉక్కు పరిశ్రమను ఒకవైపు పరిరక్షిస్తున్నామని చెపుతూనే విభాగాల వారిగా ప్రయివేట్ పరం చేసే చర్యలను వేగవంతం చేసారని, తక్షణమే కూటమి ప్రభుత్వం బిజెపి ద్వంద విధానాలపై స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు కందారపు మురళి, అంగేరి పుల్లయ్య, టి. సుబ్రమణ్యం, దాసరి జనార్దన్, సాయిలక్ష్మి, మాధవ్, లక్ష్మి, వెంకటేష్, రవి, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్, సిపిఎం నాయకులు


సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి



రాష్ట్ర ప్రభుత్వం నిన్నటి నుంచి ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలు పరిష్కరించాలని పి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగిన సిపిఎం జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సమావేశాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మద్దతు ధర కల్పించడంలో విఫలమైందని తడిసిన ధాన్యాన్ని కొనలేక రైతాంగానికి నష్టం వస్తున్నదని తెలిపారు. రైతులకు యూరియా అందించలేక యూరియా వాడకపోతే రైతులకు 800 ఇస్తాననడం సరైనది కాదన్నారు. కూటమి నాయకులు కేంద్ర ప్రభుత్వానికి పూర్తిగా మద్దతిస్తూ రాష్ట్ర ప్రజానీకానికి ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. కరేడు లాంటి ప్రాంతాల్లో ఇండోసోల్ కంపెనీకి బలవంతపు భూ సేకరణ చేయడం సరైనది కాదన్నారు. గత ప్రభుత్వంలో విమర్శించిన నేతలు అదే బాటలో నడుస్తున్నారన్నారు. పోలవరం సమస్యలు పరిష్కరించకుండా, నిర్వాసితులకు పరిహారం చెల్లించకుండా అన్యాయం చేస్తున్నారన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలలో వైసీపీ కేంద్ర బిజెపి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడం రాష్ట్ర ప్రజానీకానికి అన్యాయం చేయడమేనని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ ఫీజు రియంబర్స్మెంట్ 6400 కోట్లు చెల్లించక విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. విద్యార్థులు చివరకి అర్ధనగ్నంగా నిరసన తెలియజేసే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. జిల్లాలో కిడ్నీ బాధితుల సంఖ్య పెరుగుతూ దొరవారిసత్రం మండలంలో కేసులు ఎక్కువ అవుతున్నాయని, సూళ్లూరుపేట, నాయుడుపేట ప్రాంతాల్లో డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల విలీన సమస్యను పరిష్కరించకుండా తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. శెట్టిపల్లిలో మిగిలిపోయిన ప్లాట్ల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా నేతలు కందారపు మురళి, పుల్లయ్య, జనార్ధన్, లక్ష్మి, సాయి లక్ష్మి, మాధవ కృష్ణా, వెంకటేష్, రవి, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సౌండ్ హారన్ ప్లీజ్

- పుణ్యక్షేత్రంలో సైలెన్సర్ల మోత
- కర్ణభేరి పగులుతోందంటున్న పట్టణ ప్రజలు
- పట్టించుకోని పోలీసు శాఖ!




ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శివ నామస్మరణలతో మారు మోగాల్సిన శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం మాడిఫైడ్ బైకుల సైలెన్సర్ల శబ్దాలతో అట్టుడికి పోతోంది. విలాసాల కోసం ఖరీదైన బైకులు కొంటున్న కొందరు యువకులు మాడిఫైడ్ చేసిన సైలెన్సర్లు, హారన్‌ల తోటి పట్టణ ప్రజలను బెంబేలెత్తిస్తున్నారు. ఈ క్రమంలో ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తూ ధ్వని కాలుష్యానికి కారణమవుతున్నా ట్రాఫిక్ పోలీస్ విభాగం చూసీ చూడనట్లు వ్యవహరిస్తుందన్న విమర్శలు వస్తున్నాయి. ఆకతాయి యువత రద్దీ ఉన్న ప్రాంతాలను చూసుకొని మరి సైలెన్సర్ల మోత మోగిస్తుండడంతో కర్ణభేరి పగిలిపోతోందంటూ పట్టణ ప్రజలు వాపోతున్నారు. వైజాగ్, తిరుపతి వంటి మహానగరాల్లో మాడిఫైడ్ సైలెన్సర్లు, హారన్‌లపై పోలీసులు ఉక్కు పాదం మోపుతున్నారు. అయితే అందుకు విరుద్ధంగా శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో పోలీసుల తీరు ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సైలెన్సర్లపై చర్యలేవి?

సాధారణంగా ద్విచక్ర వాహనాల ఇంజిన్ల నుంచి వచ్చే శబ్దాన్ని తగ్గించేందుకు సైలెన్సర్లను వినియోగిస్తారు. అయితే కొందరు ఆకతాయిలు అధిక సీసీలు కలిగిన బైకులకు మోడిఫైడ్ సైలెన్సర్లను ఏర్పాటు చేసుకుని హల్చల్ చేస్తున్నారు. బుల్లెట్ తరహా బైకులకు సాధారణంగానే అధిక ధ్వనిని కలిగించే సైలెన్సర్లు ఉంటాయి. నిబంధనల మేర బైకు సైలెన్సర్ల నుంచి వచ్చే శబ్దం 80 డెసిబుల్స్‌కు మించి ఉండకూడదు. అంతకు మించి ధ్వని వెలువరిస్తున్న ద్విచక్ర వాహనాలను గుర్తించి జరిమానాలు విధించాలి. అంతేకాకుండా మాడిఫైడు సైలెన్సర్లు ఉంటే తొలగించడం, తక్కువ శబ్దాన్ని కలిగించే సైలెన్సర్లను అమర్చడం వంటి చర్యలు పోలీసు శాఖ వారు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో బైకు సైలెన్సర్లతో సైరన్లు మోగిస్తున్న ఆకతాయి యువత పట్ల పోలీసులు ఉదాసీనతగా వ్యవహరిస్తూ కేవలం కౌన్సిలింగ్ మాత్రమే ఇచ్చి పంపేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా శ్రీకాళహస్తి పట్టణ ట్రాఫిక్ పోలీసులు స్పందించి సైలెన్సర్ సైరన్‌లు మోగించే ద్విచక్ర వాహనాలు, వాటిని అమర్చే మెకానిక్‌లపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.




చర్యలు తీసుకుంటాం: గోపి, వన్ టౌన్ సీఐ



ద్విచక్ర వాహనాల మాడిఫైడ్ సైలెన్సర్ల శబ్దాలపై పట్టణ ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయి. త్వరలోనే ఆకతాయిల ఆట కట్టిస్తాం. పట్టణ వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించి మాడి ఫైడు సైలెన్సర్ లు ఉన్న ద్విచక్ర వాహనాలు గుర్తించి జరిమానా విధిస్తాం.

అనుమతులు లేని భవన నిర్మాణాల తొలగింపు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: నగరపాలక సంస్థ పరిధిలోని గోదా దేవి మార్గంలోని వెంకటేశ్వర స్కూల్ వెనుక భాగంలో అనధికారికంగా నిర్మిస్తున్న నిర్మాణాలను తొలగించామని డిప్యూటీ సిటీ ప్లానింగ్ ఆఫీసర్ ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఖాన్ మాట్లాడుతూ నగరంలోని గోదా దేవి మార్గంలోని వెంకటేశ్వర స్కూల్ వెనుక అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. కమిషనర్ మౌర్య ఆదేశాల మేరకు శుక్రవారం అనుమతులు లేని భవన నిర్మాణాలను పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది తొలగించారని తెలిపారు. నగరంలో అనుమతులు లేకుండా అనధికారికంగా నిర్మాణాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీసీపీ వెంట ఏసిపి మూర్తి, మధు, టిపిఒ వంశీ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నగరంలో భారీ వర్షం.. చల్లబడిన వాతావరణం



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: నగరంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి భారీగా వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. గత కొన్ని రోజులుగా వేసవిల తలపించే మండుటెండలు నమోదు కావడంతో నగరవాసులు ఉక్కిరిబిక్కి గురయ్యారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మూడు గంటల వరకు భారీ వర్షం కురిసింది. తర్వాత జల్లులతో వర్షం పడుతూ ఉండడంతో నగరంలో పలు రోడ్లు జలమయ్యాయి. వర్షం వల్ల డి ఆర్ మహల్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద భారీ ఎత్తున నీరు చేరుకోవడంతో కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి. రాయల్ చెరువు రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఓ మోస్తారు వర్షంతో నీరు వచ్చినా, రాకపోకలు కొనసాగించారు. వెస్ట్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగలేదు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్నచోట వర్షపు నీరు భారీగా ప్రవహించింది. వర్షం పడటం పట్ల నగర వాసులు సంతోషం వ్యక్తం చేశారు. లక్ష్మీపురం సర్కిల్, తిరుమల అబ్బాయి పాస్ రోడ్ సర్కిల్ కొర్లగుంట వద్ద రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

రాజమండ్రి - తిరుపతికి ఎయిర్ సర్వీస్ 1 న ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: విమాన ప్రయాణికులకు శుభవార్త.. దసరా పండుగ పురస్కరించుకొని రాజమండ్రి నుంచి తిరుపతికి విమాన సర్వీస్ ప్రారంభించనున్నారు. అక్టోబర్ ఒకటో తేదీన ఈ విమాన సర్వీసును కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా ప్రారంభిస్తారు. వారానికి మూడు దఫాలు ఈ సర్వీసు అందుబాటులో ఉంటుందని అలయన్స్ ఎయిర్ సర్వీస్ కంపెనీ ప్రకటించింది. ఇప్పటివరకు హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ,చెన్నై, బెంగళూరు, ఢిల్లీ ప్రాంతాలకు తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విమాన సర్వీసులు నడుస్తున్న విషయం తెలిసిందే. రాజమండ్రి తిరుపతికి మరో విమాన సర్వీసు వారానికి మూడు రోజులు మాత్రమే విమాన సర్వీసు అందుబాటులో ఉంటుందని పేర్కొంది. వారంలో మంగళ, గురు, శనివారాల్లో రాజమండ్రి నుంచి తిరుపతికి విమానాలు నడవనున్నాయి. రాజమండ్రి నుంచి ఉదయం 9.40 గంటలకు బయల్దేరి 11.20 గంటలకు తిరుపతికి చేరుతుంది. ఇక తిరుపతి నుంచి ఉదయం 7.40 గంటలకు బయల్దేరి ఉదయం 9.25 గంటలకు రాజమండ్రికి చేరనుంది. ఈ మేరకు అలయన్స్ ఎయిర్ సర్వీస్ అధికారులు వివరాలు వెల్లడించారు.

'చిత్త వైకల్య' ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండల పరిధి, నరశింగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీ దేవరాజ్ యువర్స్ అకాడమీ ఆఫ్ హెయిర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, డెమెన్షియా ఇండియా అలైన్స్ సంయుక్తంగా వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వెంగమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తవైకల్యం (డెమెన్షియా) అనేది కుటుంబంపైన, సమాజంపై ప్రభావం చూపించే సమస్య అన్నారు. వయస్సు పెరిగే కొద్దీ గుర్తుపట్టే శక్తి, ఆలోచన, ప్రవర్తనలో మార్పులు రావడం కేవలం మతిమరుపు మాత్రమే కాదన్నారు. జీవన విధానాన్ని ప్రభావితం చేసే మెదడు సమస్య అన్నారు. ఎవరైనా ఇటువంటి సమస్యతో బాధపడుతున్నట్లయితే ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.


మండల స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి -ఏర్పేడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో అండర్ 14, 17 మండల స్థాయి క్రీడా పోటీలు, ఎంపికలు ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఏర్పేడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీసీ సంక్షేమ వసతి గృహ అధికారి పల్లా వెంకటేశ్వర్లు హాజరై, పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునిరత్నం, మండల విద్యా శాఖాధికారి2 దయాకర్, సర్పంచ్ శివయ్య, ప్రగతి కోఆర్డినేటర్ శిరీష, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్వాడీలో 8వ రాష్ట్రీయ పోషణ మాసం

ప్రజాశక్తి -ఏర్పేడు : రేణిగుంట ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గుడిమల్లం పాఠశాల, అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టిక ఆహార ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన మండల వ్యాప్తంగా ఈ అక్టోబర్ 16 వరకు జరుగుతుంది. ఈ కార్యక్రమంలో పాపానాయుడుపేట ఐసీడీఎస్ సూపర్వైజర్ అనిత, వారిలు మాట్లాడుతూ మహిళలు, కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకుని రక్తహీనతను అధిగమించాలని సూచించారు. హెల్త్ సూపర్వైజర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పిల్లలకు పౌష్టికాహార లోపం లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బత్తల గిరినాయుడు, నరసింహ యాదవ్, పద్మనాభం నాయుడు, అంగన్వాడీ టీచర్ సుజాత, లక్ష్మీ, శిరీష గీతాంజలి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులు రఘునాథ్, పురుషోత్తంలను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పాకాల: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న దామల చెరువు ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు రఘునాథ్, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు పురుషోత్తంలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుమతమ్మ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యంఈఓలు బాబ్జి, లింగయ్యలు మాట్లాడుతూ ఇద్దరు ఉపాధ్యాయులు ఉత్తమ బోధనతో అవార్డు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధికి పత్రిపాటివారిపల్లి చెందిన లక్ష్మణ్ అశోక్ బాబు 10 వేల రూపాయలు విలువ చేసే సామగ్రిని వితరణగా అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సి.ఆర్.పి. శ్రీనివాసులు పాల్గొన్నారు.

మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-ఏర్పేడు: మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలను, శుక్రవారం ఏర్పేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖాధికారి దయాకర్ ప్రారంభించారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా అవసరమని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునిరత్నం, ఏర్పేడు సర్పంచ్ నల్ల పాలెం శివయ్య, బీసీ వసతి గృహం వార్డెన్ పల్లా వెంకటేశ్వర్లు, మొమెంటోలు, మెడల్స్ దాత రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో బోరు బావి ఏర్పాటు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండలం, పాలిచర్ల రాజు పాలెం, గిరిజన కాలనీలో తాగు నీటి సమస్య ఉందని శాసన సభ సభ్యులు పాశం సునీల్ కుమార్‌ని స్థానికులు కలిసి కోరారు, వెంటనే స్పందించిన ఆయన బోరు వేయిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం మంచినీటి బోరు వేయించారు. ఈ సందర్భంగా కాలనీ నాయకులు వెంకటేశ్వర్లు రాజు, సుబ్బరాజు, గ్రామస్తులు, గిరిజనులు ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలిపారు.

జనసేనలోకి గుత్తా కోటేశ్వర నాయుడు



విలేకరులతో మాట్లాడుతున్న కోటేశ్వర నాయుడు

ప్రజాశక్తి - చంద్రగిరి: తిరుపతి రూరల్ మండల ఇంచార్జ్ పగడాల మురళి ఆధ్వర్యంలో, చెర్లోపల్లి గ్రామ పంచాయతీకి చెందిన రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు, 93 వార్డు మెంబర్ గుత్తా కోటేశ్వర నాయుడు తన అనుచరులతో కలిసి చంద్రగిరి పార్టీ కార్యాలయంలో శుక్రవారం జనసేన పార్టీలో అధికారికంగా చేరారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్చార్జ్ దేవర మనోహర్ పార్టీలో చేరిన నాయకులకు జనసేన కండువా కప్పి ఆహ్వానించారు. దేవర మనోహర్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో ప్రజలు జనసేన వైపు ఆకర్షితులవుతున్నారన్నారు.

రావి సుధాకర్ చౌదరికి ఘన సత్కారం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చక్కెర పరిశ్రమలో దశాబ్దాల కాలంగా విశేష సేవలు అందిస్తున్న నెల్లూరు జిల్లా, ఈదూరుకు చెందిన రావి సుధాకర్ చౌదరిని ది సౌత్ ఇండియన్ షుగర్ కేన్ అండ్ షుగర్ టెక్నాలజిస్ట్ అసోసియేషన్ వారు శుక్రవారం ఘనంగా సత్కరించారు. తిరుపతి నగర పరిధిలోని శ్రీ కన్వెన్షన్ హాల్ వేదికగా రెండు రోజులపాటు జరుగుతున్న దక్షిణ భారత చక్కెర పరిశ్రమల నిర్వాహకులు, అనుబంధ ఫ్యాక్టరీల సంబంధించిన వారితో 54వ కన్వెన్షన్ ఘనంగా నిర్వహించారు. అగ్రికల్చర్ డీన్, ఎమ్మెల్యే పూర్తి చేసి వివిధ షుగర్ ఫ్యాక్టరీలలో అనేక హోదాలలో రావి సుధాకర్ చౌదరి పనిచేసి విశేష కృషి చేశారన్నారు. అనేకసార్లు కేంద్రమంత్రుల చేతుల మీదుగా జాతీయ పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారన్నారు. 2015లో సీఎం చంద్రబాబు ఆయనను షుగర్ కేన్ ఎక్స్‌పర్ట్ కమిటీ ఛైర్మన్‌గా నియమించారని సభకు తెలిపారు. ప్రముఖులు అభినందనలు తెలిపారు.

సీసీరోడ్డు వేశారు.. మట్టిపోయడం మరిచారు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: వేణుగోపాలపురంలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా రూ. 8 లక్షల నిధులతో సిమెంట్ రోడ్డు వేశారు. మాల్యాలో గ్రామంలోని వీధులలో 200 మీటర్ల మేర సిమెంట్ రోడ్డును కూటమి నాయకులు వేయించారు. రోడ్డు వేసి ఆరునెలలు కావస్తున్న సిమెంట్ రోడ్డుకు ఇరువైపుల మట్టిని తోలకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సిమెంట్ రోడ్డుకు ఇరువైపుల మట్టిని తోలాలని పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని మండల వైసీపీ యూత్ లీడర్ చిట్టిబోయిన కిరణ్ యాదవ్ ఆరోపించారు. మట్టి తోలించాలని గ్రామస్తులు అధికారులను కోరారు.

ఆపేదెవర్రా..? అంతా మా ఇష్టం

- చంద్రగిరిలో రెచ్చిపోతున్న ఇసుక మాఫియా
- చూసి చూడనట్లు మౌనం వహిస్తున్న రెవిన్యూ అధికారులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రెడ్డివారిపల్లె గ్రామస్తులు
- అడ్డుకున్న గ్రామస్తులపై తిరగబడుతున్నారని100కు ఫోన్ చేసి ఫిర్యాదు



ఇసుక తరలింపొద్దని ట్రాక్టర్ చక్రం కింద అడ్డుగా పడుకున్న గ్రామస్తుడు బాబ్జి

ప్రజాశక్తి - చంద్రగిరి: ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, రెడ్డివారిపల్లెలో గ్రామస్తులు ఆందోళనకు దిగి, అక్రమ ఇసుక రవాణాను నిలిపివేయాలంటూ డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం రెడ్డివారిపల్లికి చెందిన గ్రామస్తులు ఇసుక ట్రాక్టర్ టైర్ కింద పడుకొని ఆందోళన చేశారు. వెంటనే ఇసుక అక్రమ రవాణాను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటున్న వారిపై ఇసుక మాఫియా దాడికి పాల్పడుతున్నట్లు ఆందోళనకారులు వాపోతున్నారు. రాత్రిపూట ట్రాక్టర్ శబ్దాలతో నిద్రలేకుండా పోతోందని ఆందోళనకారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆందోళనకారులకు ఇసుక మాఫియాకు తీవ్ర వాగ్వివాదం జరిగింది. జెసిబి యంత్రాలతో ఇసుకను ట్రాక్టర్లు టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారని తద్వారా భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని గ్రామస్తులు ఆరోపించారు. రెడ్డివారిపల్లెలో ఇసుక మాఫియాపై జరుగుతున్న ఆందోళన కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా చంద్రగిరి సి.ఐ ఇమ్రాన్ భాషా ఆదేశం మేరకు పోలీసులు రెడ్డివారి పల్లికి వెళ్లారు. ఆందోళన చేస్తున్న వారితో చర్చించారు. ఇరు వర్గాలతో పోలీసు చర్చించారు.

అనుమతులు ఎవరిచ్చారు..?

ఇసుకను అక్రమ రవాణా చేసేందుకు అనుమతులు ఎవరిచ్చారో చెప్పాలంటూ రెడ్డి వారిపల్లి గ్రామస్తులు ఇసుక మాఫియా చేస్తున్న వారిని డిమాండ్ చేశారు. అనుమతి ఇచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఇక్కడికి రావాలని డిమాండ్ చేశారు. రాత్రిపూట నిద్ర లేకుండా, హారన్, ఇతర శబ్దాలతో అవస్థలు పడుతున్నామని, తమకు న్యాయం చేసేంతవరకు ఆందోళన విరమించేది లేదని తెలిపారు. చివరకు చంద్రగిరి పోలీసులు ఆందోళనకారుల వద్ద ఫిర్యాదు తీసుకొని వారిపై చర్యలు తీసుకుంటామని సద్ది చెప్పి వెనుక పంపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే ఆందోళన ఉధృతం చేస్తామని గ్రామస్తులు తెలియజేశారు.



పోలీసులకు వీడియోలు చూపుతున్న బాబ్జి

వేడుకగా శ్రీసిటీ-రాక్‌వర్త్ పరిశ్రమ 14వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - సత్యవేడు : ఆఫీస్ ఫర్నిచర్ తయారీ అగ్రగామి సంస్థ రాక్‌వర్త్ సిస్టమ్స్ ఫర్నీచర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, శ్రీసిటీలోని తమ పరిశ్రమ 14వ వార్షికోత్సవాన్ని వేడుకగా జరుపుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సంస్థ ఉద్యోగులందరికీ వినోదాత్మక ఆటలు, పోటీలు నిర్వహించారు. ఈ వేడుకలో కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ శైలేష్ కుమార్, తన తల్లి జ్ఞాపకార్థం మీనాదేవి మెమోరియల్ ట్రస్ట్ పేరిట విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేశారు. రాక్‌వర్త్ ఉద్యోగుల పిల్లలు 40 మందికి, పరిసరాలకు చెందిన ఇతర పిల్లలు మరో 25 మందికి, మొత్తంగా 30 లక్షల రూపాయలను విద్యా ఫీజులు చెల్లించి, రసీదులను విద్యార్థులకు ఇచ్చారు. ఈ సందర్భంగా 65 మంది విద్యార్థులు ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందగా, రాబోయే ఏడాదిలో ఈ సంఖ్యను 100 మందికి పెంచాలన్నది తన సంకల్పంగా శైలేష్‌కుమార్ సింగ్ ప్రకటించారు.

శిథిలమైన గోడకు మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మార్కెట్ యార్డ్‌లో ప్రహరీ గోడలకు మరమ్మతులు చేయాలని, మార్కెట్ కమిటీ చైర్మన్ డిఎస్ గణేష్ పేర్కొన్నారు. శుక్రవారం పుత్తూరు మార్కెట్ పాలక వర్గ సర్వసభ్య అధ్యక్షులు కార్యదర్శులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మార్కెట్ యార్డ్‌లో స్థలం, ఆక్రమాణకు గురవకుండా సర్వే చేయించి తహశీల్దారుకి వినతి పత్రం పంపాలని కోరారు. వారపు సంతలో రైతు బజారు ఏర్పాటు చేయాలన్నారు. మౌలిక వసతులు, పైప్ లైన్లు ఏర్పాటు చేసి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించి రైతులకు నీటి సౌకర్యం కల్పించాలని, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, వడమాలపేటలో స్థలంలో రైతు బజారు ఏర్పాటు చేయాలని, మార్కెట్ గోడౌన్ ముందు సిసి రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి తులసి రామ్, వైస్ చైర్మన్ లీలావతి, కమిటీ సభ్యులు. రమేష్, ఉమా శంకర్ రెడ్డి, అమర్నాథ్, చిలకమ్మ, బాబు నాయుడు, పరమేశ్వర మంగళం సింగల్ విండో అధ్యక్షులు ఎస్ మోహన్ రాజు పాల్గొన్నారు.

సిజీహెచ్‌ఎస్ ఏర్పాటుకు ఎంపీ కృషి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: కేంద్ర ప్రభుత్వం సిజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్‌లు ప్రారంభించేందుకు అవసరమైన సిబ్బంది నియామకాలు చేపట్టేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి పార్లమెంటు సమావేశాలలో సిజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్ అందుబాటులో లేక కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్య సేవలు పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్రం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సిజీహెచ్‌ఎస్ తక్షణమే ప్రారంభించడానికి పూర్తి స్థాయిలో సిబ్బంది అనుమతులపై సమీక్ష పూర్తయ్యే వరకు అందుబాటులో ఉన్న సిబ్బందిని ఉపయోగించుకుని, అవసరమైతే అదనపు కాంట్రాక్టు సిబ్బందిని నియమించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పార్లమెంటు వేదికగా నిరంతరం సమస్యలు వినిపిస్తూ, సంబదిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నట్లు ఎంపీ తెలిపారు.

అగ్ని ప్రమాదంపై సీఐటీయు నాయకుల విచారం



ప్రజాశక్తి - నాయుడుపేట: గురువారం నాయుడుపేట మండలం మేనకూరు సెజ్‌లోని అరబిందో ఫార్మాసిటికల్ కంపెనీలో సంభవించిన అగ్ని ప్రమాదంపై నాయుడుపేట, వెదనపర్తి సుందర్ రామిరెడ్డి భవన్, సిఐటియు కార్యాలయంలో సిఐటియు నాయకులు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ మేనకూరు సైజులో పనిచేస్తున్న కార్మికుల గురించి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం జరిగిన సంఘటనపై పూర్తిగా దర్యాప్తు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సిఐటియు నాయకులు శివకవి ముకుంద మాట్లాడుతూ మేనకూర్ సెజ్ వేలాదిమంది స్థానికులు, కుటుంబాలను వదిలి పొట్టకూటికోసం ఎక్కడెక్కడ నుండో వలస వచ్చిన వేలాదిమంది కార్మికులు పని చేస్తున్న చోట భద్రతా చర్యల విషయంలో అధికారులు నీళ్లు వదిలేస్తున్నారని దుయ్యబట్టారు. ఇటీవల చాలా పరిశ్రమల్లో కార్మికులు ప్రమాదాల్లో మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక సంఘ నాయకులు భద్రతా చర్యలు చేపట్టమని లేబర్ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్న వారు చెబుతున్న సమాధానం మాత్రం ఒక్కటే మాకు ప్రజాప్రతినిధులు పరిశ్రమలపై చర్యలు తీసుకునే పవర్స్ ఇవ్వలేదని దాటవేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మస్తాన్ రెడ్డి,కాలేషా,శంకర్,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దాతృతంతో.. ప్రాణాలు కాపాడండి



బాలుడి వైద్య ఖర్చులకు ఆర్థిక సాయమందిస్తున్న ట్రినిటీ హాస్పిటల్ ఎండి డాక్టర్ సందీప్

ప్రజాశక్తి - నాయుడుపేట: దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ప్రాణాపాయ స్థితిలోఉన్న ఒక పేద బాలుడు ప్రాణాలు కాపాడాలని ట్రినిటీ హాస్పిటల్ ఎండి డాక్టర్ సందీప్ కోరారు. తడ మండలం, గద్దగుంటలో ఒక బాలుడు సంవత్సర కాలం నుంచి బోన్ మేరో సమస్యతో బాధపడుతున్నాడు. ఆ బాలుడి తల్లి దండ్రులు పేదవారు కావడంతో చికిత్స చేయించుకునే ఆర్థిక స్తోమత లేక, అప్పులు చేస్తూ హైదరాబాదులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స చేస్తున్నారని, ఈ క్రమంలో శుక్రవారం ఆ బాలుడు తల్లిదండ్రులు ట్రినిటీ హాస్పిటల్లో డాక్టర్ సందీప్‌ను కలవగా ఆయన పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు ఆయన మాట్లాడుతూ ఈ బాబుకు బోన్ మేరో మార్పిడి ఆపరేషన్ జరగవలసి ఉందని అందుకు పాతిక లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. ఇప్పటివరకు దాతలు ముందుకు వచ్చి ఆరు లక్షల రూపాయల వరకు అందించారు.ఈ నెంబర్ల ద్వారా దాతలు తమకు తోచనంత సహాయం అందించాలని బాలుడి తల్లిదండ్రులు కోరారు. అందించవలసిన నెంబర్లు 9492748707, 9492749505.

సిక్స్ వే లైన్ వద్దు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: నాయుడు పేట- చెన్నై రోడ్లను కలుపుతూ ఆరు లైన్ల రోడ్డు ప్రతిపాదనను పునరాలోచించాలని స్థానికులు ఆర్డీవోను కోరారు. ఆరు లేన్ల రోడ్డుకు వ్యతిరేకంగా శుక్రవారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. గతంలో చెన్నై, నాయుడుపేట రోడ్లను కలుపుతూ తొట్టంబేడు బసవయ్యపాలెం వద్ద నాలుగు లైన్ల రోడ్డును వేయడం జరిగిందనీ, అందులో మరికొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇప్పుడు నాలుగు లైన్ల రోడ్డును ఆరు లైన్ రోడ్డుగా మార్చడం వలన తాము తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు.దీనికి ప్రత్యామ్నాయంగా తొట్టంబేడు, సాంబయ్యపాలెం, కల్లిపూడి రోడ్డును పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

తైక్వాండో కోచ్ మాస్టర్ గోపి నాయుడుకు సత్కారం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: కేంద్ర మంత్రిత్వ శాఖ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ప్రైజెస్ వారి ప్రతిష్టాత్మక 'సుభాష్ చంద్రబోస్ ఐకాన్ అవార్డు-2025'ను అందుకున్న టీటీడీ పాఠశాలల తైక్వాండో క్వాండో కోచ్ మాస్టర్ కె.గోపి నాయుడును టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి అభినందించారు. క్రీడల్లో గోపీనాయుడు సేవలకు గుర్తింపుగా అందుకున్న 'సుభాష్ చంద్రబోస్ ఐకాన్ అవార్డు-2025'ను ఆయన చేతుల మీదుగా అందజేశారు.

ఛలో మెడికల్ కాలేజ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా ఛలో మెడికల్ కాలేజ్‌లో భాగంగా, స్టేట్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూమన అభినయ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మదనపల్లె మెడికల్ కాలేజ్ సందర్శన కార్యమానికి నెల్లూరు జిల్లా యూత్ ప్రెసిడెంట్ ఊటుకూరు నాగార్జున్, యువజన కార్యదర్శి కొండూరు సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన హెచ్‌సిసి ప్రతినిధుల బృందం

ప్రజాశక్తి -వరదయ్యపాలెం : చెన్నైలోని హిందూస్థాన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (హెచ్‌సిసి)కి చెందిన 25 మంది ప్రతినిధుల బృందం శుక్రవారం శ్రీసిటీని సందర్శించి, ఇక్కడ వ్యాపార అవకాశాలు, పారిశ్రామిక సామర్థ్యాన్ని పరిశీలించింది. సంస్థ చైర్మన్ గోపీనాథ్, వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్ తాతియా నేతృత్వంలో విచ్చేసిన బృందానికి శ్రీసిటీ డైరెక్టర్ (సి ఎస్ ఆర్) నిరీషా సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రపంచ స్థాయి మౌళిక సదుపాయాలు, వ్యూహాత్మక ప్రయోజనాలు, ఇతర ప్రత్యేకతల గురించి శ్రీసిటీ అధ్యక్షుడు (ఆపరేషన్స్) సతీష్ కామత్ వారికి వివరించారు. ఈ సందర్శనపై స్పందించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, వివిధ రంగాల వ్యాపార చర్చల నిర్వహణలో హెచ్‌సిసి కీలక పాత్ర పోషిస్తుందన్నారు. పరిశ్రమ, ప్రభుత్వం, వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థ మధ్య వారధిగా హెచ్‌సిసి పాత్రను ఆయన ప్రశంసించారు. వారి పరిశీలనలు, సూచనలు శ్రీసిటీలోని చిన్న, మధ్య తరహా సంస్థల బలోపేతానికి దోహదం చేస్తాయని చెప్పారు. పర్యటనలో భాగంగా శ్రీసిటీ అధికారులతో చర్చలలో పాల్గొన్న ప్రతినిధులు, వివిధ అంశాల గురించి నిశితంగా ఆరాతీసి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం డైకిన్, వరుణ్ బేవరేజెస్ (పెప్సికో), ఎంఎస్ఆర్ గార్మెంట్స్ పరిశ్రమలను సందర్శించారు. కంపెనీల సాంకేతిక నైపుణ్యాలు, తయారీ విధానాలను పరిశీలించారు. సందర్శనకు సహకరించిన శ్రీసిటీ యాజమాన్యానికి గోపీనాథ్ ప్రవీణ్ తాతియా తెలిపారు. శ్రీసిటీ ప్రణాళిక, పెట్టుబడి అనుకూల వాతావరణాన్ని కొనియాడారు. పారిశ్రామిక నగరంగా శ్రీసిటీ మరింత అభివృద్ధి సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు. చెన్నై కేంద్రంగా 1945లో స్థాపించబడిన హిందూస్తాన్ చాంబర్ ఆఫ్ కామర్స్ సంస్థ, దేశంలోని స్వతంత్ర, లాభాపేక్షలేని వ్యాపార సంస్థలలో ఒకటి. వాణిజ్య సంబంధాలను ప్రోత్సహించటం, వ్యాపార విధానాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా ఇది పని చేస్తుంది. వ్యాపారులకు ఆధునిక వ్యాపార మార్గదర్శకాలు, మార్కెటింగ్, ఆర్థిక నిర్వహణ, అంతర్జాతీయ వ్యాపార సంబంధాలు, ఇతర అంశాలపై శిక్షణ ఇస్తుంది.

ట్రస్టు బోర్డు చైర్మన్ పదవిపై తమ్ముళ్లు గుస్సా

పవన్ నిర్ణయంపై వినుత అసంతృప్తి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ప్రతిష్టాత్మక శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పదవిని అనూహ్యంగా జనసేన నాయకుడు కొట్టే సాయికి కట్టబెట్టడంపై శ్రీకాళహస్తి నియోజకవర్గం వ్యాప్తంగా తెలుగు తమ్ముళ్లు కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వ నిర్ణయం గర్హనీయమనీ, ఇదొక బ్లాక్ డే గా సామాజిక మాధ్యమాల్లో అభివర్ణిస్తున్నారు. ఆరు నెలల నుంచి నాటకీయంగా సాగిన శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పదవికి కూటమిలోనే ఎంతోమంది నాయకులు పోటీపడ్డారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సైతం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడును శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్‌గా నియమిస్తున్నట్లు కొద్దిరోజులు ముందు బహిరంగంగా తెలిపారు. దానికి తగినట్లే మొదట నియోజవర్గంలో చెంచయ్య నాయుడు పేరు మారుమోగింది. గత రెండు వారాల నుంచి బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ సతీమణి పేరు ఖరారు అయినట్లు బిజెపి శ్రేణులు ప్రచారం చేసుకున్నారు. అయితే అనూహ్యంగా జనసేన పార్టీకి చెందిన కొట్టే సాయి ప్రసాద్‌ను శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ పదవి వరించింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేస్తున్న ఓ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న సాయిని అప్పటి శ్రీకాళహస్తి సీఐ అంజూయాదవ్ చెంప దెబ్బలు కొట్టి పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. దాని ఫలితమే సాయికి చైర్మన్‌గిరి దక్కిందని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అయితే మేమూ చెంప దెబ్బలు తిన్నాం.. మాకూ పదవి ఇవ్వండి అని తెలుగు తమ్ముళ్లు సామాజిక ప్రసారమాధ్యమాల్లో బ్లాక్ డే ప్రచారం చేస్తున్నారు. ఈ బ్లాక్ డే నినాదం ఆ పార్టీలో గుర్తింపు పొందిన నాయకులే ప్రచారం చేయడం కొస మెరుపు. తమ్ముళ్ల నిరసనలు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డికి తెలుసో..! తెలియదు కానీ చైర్మన్ పదవి తమకంటే తమకే కావాలంటూ సామాజిక వర్గాల వారీగా డిమాండ్లు పెడుతున్నారు. అయితే చైర్మన్ పదవికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు వెలువడక పోవడంతో శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ పదవి వ్యవహారంపై రాష్ట్ర జిల్లా స్థాయిలో హాట్ టాపిక్‌గా మారింది.


ఇది అన్యాయం : వినుత .. ఇదిలా ఉంటే జనసేన నాయకుడు కొట్టే సాయికి ట్రస్ట్ బోర్డు చైర్మన్ పదవి ఇవ్వడం అన్యాయమని జనసేన మాజీ ఇంచార్జి కోటా వినుత సామాజిక మాధ్యమం ద్వారా ఓ లేఖను విడుదల చేశారు. మహిళలంటే గౌరవం లేని సాయికి చైర్మన్ పదవి ఇవ్వడం దుర్మార్గమని వాపోయారు. తన పతనాన్ని కోరుకున్న వారిలో సాయి పాత్ర కూడా ఉందంటూ ఆరోపణలు చేశారు. ఆరోపణలకు సంబంధించిన అన్ని ఆధారాలు జనసేన అధిష్టానం వద్ద ఉన్నాయని వివరించారు. చైర్మన్ పదవిపై జనసేనాని పునరాలోచించి క్రమశిక్షణతో కష్టపడ్డ జన సైనికులకు ఇవ్వాలని సూచించారు. సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిన ఈ లేఖ వినుత అధికారిక సోషల్ మీడియా ఖాతా నుంచి వచ్చిందా లేదా అన్నది తెలియరాలేదు.

సురప్పకసం తుడా లేఔట్‌కు విశేష స్పందన

తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి రేణిగుంట హైవే పద్మావతి నగర్ లోని సురప్పకసం తుడా లేఔట్ ఈ వేలంకు ప్రజలనుంచి అనూహ్య స్పందన లభిస్తోందని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్రె డ్డిఅన్నారు. శుక్రవారం అయన మీడియతో మాట్లాడారు. సురప్పకాశంలోని మొత్తం 277 ఫ్లాట్లకు ఈ నెల4 వ తేదీ నుంచి 17 తేదీ వరకు 13వ విడత ఈ వేలం నిర్వహించామన్నారు. ప్రజలనుంచి అనూహ్య స్పందన రావడంతో ఈ వేళలను ఈనెల 24 వరకు పొడిగించడం జరిగిందని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పటివరకు 105 ఫ్లాట్లు అమ్మకం జరగగా సుమారు 39 కోట్ల రూపాయలు తుడాకు ఆదాయం లభించిందని తెలియజేసారు. పొడిగించిన సమయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తుడాపై నమ్మకం ఉంచి తుడా లేఔట్స్‌లో ఫ్లాట్స్ కొనుగోలు చేస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.

కుమారికి మహిళా శాస్త్రవేత్త అవార్డు



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మైక్రోబయాలజీ విభాగం ఆచార్య చండి ఎం. కుమారికి జమ్మూలోని షేర్-ఎ-కాశ్మీర్ వ్యవసాయ శాస్త్ర, సాంకేతిక విశ్వవిద్యాలయంలో ఈ నెల 15-18 వరకు నిర్వహించిన 10వ ఆసియా పిజిపిఆర్ అంతర్జాతీయ సమావేశంలో మహిళా శాస్త్రవేత్త అవార్డు లభించింది. "సూక్ష్మజీవుల సాంకేతికత, స్థిరమైన పర్యావరణానికి సూక్ష్మజీవుల వాడకం"పై ఆమె చేసిన పరిశోధనకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రదానం చేశారు. "అబియోటిక్ ఒత్తిళ్లకు వ్యతిరేకంగా పంట స్థితిస్థాపకతను మెరుగు పరచడానికి అవసరమైన వ్యూహాలను అభివృద్ధి చేయడం అంశం"పై ప్రసంగించినందుకు కూడా ఆమె మొదటి బహుమతి అందుకున్నారు.

క్రైం న్యూస్

ఎర్రచందనం స్మగ్లర్లకు మూడేళ్లు జైలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల పరిధిలోని కారణమెట్ట గ్రామానికి చెందిన ఏడుగురు ఎర్రచందనం రవాణా చేస్తున్న స్మగ్లర్లను బుచ్చినాయుడు కండ్రిగ పోలీస్ స్టేషన్ సిబ్బంది అదుపులోకి తీసుకుని, కేసు ఫైల్ చేసి కోర్టులో హాజరపరిచారు. కోర్టులో విచారణ అనంతరం, స్మగ్లర్లకు మూడేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి చొప్పున 20 వేల రూపాయలు జరిమాన విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పునిచ్చారు. ఈ మేరకు సమ్మిటి పెద్ద గురవయ్య, కారని రామయ్య, పిగిలి మోహన్, పిగిలి వెంకటయ్య, చెరివి శ్రీనాథ్, చెరివి రమణయ్య, వెంకటగిరి మునిరత్నంలపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ తీర్పును వెలువరించారు. కేసు పురోగతికి సహకరించిన పోలీసులను ఎస్పీ అభినందించారు.

మద్యం మత్తులో పాము తలను కొరికిన వ్యక్తి.. పరిస్థితి విషమం



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): మండలంలోని చియ్యవరంలో గురువారం రాత్రి, గ్రామానికి చెందిన వెంకటేష్ ఫుల్లుగా మద్యం సేవించి ఇంటికి వస్తున్న సమయంలో పాము కాటేసింది. దీంతో మద్యం మత్తులో ఉన్న వెంకటేష్ కోపోద్రిక్తుడై నన్నే కరుస్తావా అంటూ పామును పట్టుకుని తలను కొరికేశాడు. ఆ తర్వాత చనిపోయిన పామును ఇంటికి తీసుకువెళ్లి పక్కలో పెట్టుకుని నిద్రించాడు. శుక్రవారం ఉదయం పరిస్థితిని గమనించిన వారి కుటుంబ సభ్యులు వెంకటేష్‌ను శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి లో చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతిలోని రుయా హాస్పిటల్ కు తరలించారు. వెంకటేష్ ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందని వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి అన్నమయ్య జిల్లా రాజంపేట అటవీ ప్రాంతంలో 5 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఒక స్మగ్లరును అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. ఆర్ ఐ కృపానందకు చెందిన ఆర్ఎస్ఐ కె.అల్లి బాషా బృందం రాజంపేట రోళ్లమడుగు ఫారెస్ట్ బీటు పరిధిలో కూంబింగ్ చేపట్టారని అధికారులు తెలిపారు. శుక్రవారం ఉదయం పుట్టంగి మడుగు ప్రాంతంలో కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు మోసుకుని వెళుతూ కనిపించారని, వారిని చుట్టుముట్టే ప్రయత్నిం చేయడంతో వారు పారిపోవడానికి యత్నించడంతో వెంటపడి ఒక వ్యక్తిని పట్టుకోగలిగారన్నారు. ఆ పరిసర ప్రాంతాల్లో 5 ఎర్రచందనం దుంగలను గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. దీనిపై టాస్క్ ఫోర్స్ సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి



మృతుడు పాచి బత్తయ్య

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): మండలంలోని పూడి పంచాయతీలో శుక్రవారం ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న క్రమంలో ట్రాక్టర్ బోల్తా పడి ఒక వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన చోటుచేసుకుంది. తొట్టంబేడు మండలం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ బలరాం తెలిపిన వివరాల మేరకు పాచి బత్తయ్య (55) అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన మురళి యాదవ్ అనే రైతు దగ్గర పొలం దున్నటానికి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని తెలిపారు. శుక్రవారం సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో ట్రాక్టర్‌తో పొలం దున్నటానికి బత్తయ్య పొలంలోకి వెళ్ళాడు. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలకు భూమి బాగా తడిసి ఉండటంతో ట్రాక్టర్ పొలంలో ఇరుక్కుపోయింది. ఎంతసేపటికి ట్రాక్టర్ ముందుకు కదలకపోవడంతో ట్రాక్టర్‌కు అమర్చి ఉన్న ఇనుప నాగలని తీసేసి ట్రాక్టర్‌ను బాగా రైజ్ చేసి ముందుకు నడపాలని ప్రయత్నిస్తుండడంతో ట్రాక్టర్ ముందు చక్రాలు ఒక్కసారిగా పైకి లేవడంతో ట్రాక్టర్ బోల్తా పడి అందులో ఉన్న డ్రైవర్ ట్రాక్టర్ కింద పడి మరణించడం జరిగిందని తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రాక్టర్ కింద పడి ఉన్న మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించామని అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

ప్రజాశక్తి- బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఫౌండేషన్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఎంఈఓ-2 మునిసుబ్రమణ్యం సూచించారు. ఆయన శుక్రవారం గాజులపెళ్లూరు, ఎస్టీ కాలనీలో పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, రికార్డులు, రిజిస్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి టీచర్లకు, భోజన నిర్వాహకులు సూచనలు చేశారు. ఒకటో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిక్షించి, విద్యార్థుల్లో అక్షరాలను గుర్తించడంతోపాటు, రాయడం, చదవడం వంటి నైపుణ్యాలను మెరుగు పరచాలని ఉపాధ్యాయులకు సూచించారు.

పోషణ సంరక్షణలో పురుషుల భాగస్వామ్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, అశోక్ నగర్ సెక్టార్ పరిధిలోని నమాజ్ కట్ట, పి.ఎస్ఆర్ పార్కు అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాల్లో భాగంగా సెక్టార్ సూపర్ వైజర్ సుజన ఆధ్వర్యంలో పిల్లలు, తల్లులు పోషణలో పురుషుల భాగస్వామ్యం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుషులు పోషకాహారం వండే సమయంలో, వైద్య పరీక్షల సమయంలో మహిళలకు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సర్వే



ప్రజాశక్తి -దొరవారిసత్రం : పాలెంపాడులో ప్రతి ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి బాలకృష్ణ నాయక్ సూచించారు. శుక్రవారం మండలం పరిధిలోని పాలెంపాడు గ్రామాన్ని ఆయన సందర్శించారు. పాలెంపాడు గ్రామంలో ప్రజలు కిడ్నీ వ్యాధి సోకి, మరణిస్తున్నారని సమాచారం అందడంతో, ఇంటిటికి వెళ్లి వివరాలు, అడిగితెలుసుకున్నారు. మా గ్రామంలోని నీళ్లు త్రాగడం వాళ్ళ కిడ్నీ వ్యాధి బారినపడుతున్నామని స్థానికులు అయనకు తెలిపారు. వెంటనే అయన స్పందించి, గ్రామంలో 20సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి వైద్యపరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. తాగు నీటిని పరీక్షలకు పంపించాలన్నారు. గ్రామంలో 23మంది కిడ్నీ వ్యాధి గ్రహస్థులున్నారని, ఇద్దరు డయాలసిస్ చేసుకొంటున్నారని, వైద్య సిబ్బంది గుర్తించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చైతన్య, లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణిలు, బాలింతలకు పౌష్టికాహారం తప్పనిసరి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : గర్భిణీలు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టిక ఆహారం తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ బి సంధ్యారాణి తెలిపారు. ప్రాజెక్టు పోషణ మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు కామరాజు నగర్‌లోని 3 అంగన్వాడీ కేంద్రాలు కలిసి ఫుడ్ గ్రూప్స్ గురించి వివరించారు. గొల్లపల్లి పీహెచ్సీ పరిధిలోని తడుకు సచివాలయంలో, ఆరేటమ్మ కాలనీ యూపీహెచ్సీ పరిధిలో, సిఎల్ఎఫ్ సభ్యులకు పోషకాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో సూపర్వైజర్ గీతాంజలి, శ్రీదేవి, అంగన్వాడి టీచర్లు, వైద్య అధికారులు. ఏఎన్ఎంలు, తడుకు సర్పంచ్ బొమ్మిలి వెంకటేష్ యాదవ్, అనిత, మహిళలు పురుషులు పాల్గొన్నారు.

ఫంగల్ డీసీజ్‌పై అవగాహన వారోత్సవాలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: స్విమ్స్ మైక్రోబయాలజీ, ఇ.యస్.టి, డెర్మటాలజీ విభాగాల ఆధ్వర్యంలో ఫంగల్ డీసీస్ అవగాహన వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ కుమార్ మాట్లాడుతూ మైక్రోబయాలజీ, ఇయన్టీ, డెర్మటాలజీ విభాగాల ఆధ్వర్యంలో ఫంగల్ డీసీస్ అవగాహన వారోత్సవాలను సెప్టెంబర్ 15వ తేదీ నుండి 19వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని, ఫంగస్ వ్యాధి ముఖ్యంగా చర్మం లేదా గోర్లను ప్రభావితం చేసేవిగా ఉంటాయని, రక్తప్రసరణ సరిగా లేక డయాబెటిస్ ఉంటే, ముఖ్యంగా తీవ్రమైన ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఎక్కువుగా ఉంటుందని వీటినంత త్వరగా డాక్టర్ ను సంప్రదించి వ్యాధి నయం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ హరిక, డాక్టర్ రామక్రిష్ణ, డాక్టర్ మౌర్య, మైక్రోబయాలజీ, ఇయన్.టి, డెర్మటాలజీ విభాగాల వైద్యులు, విద్యార్థులు, పేషెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలు



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: స్విమ్స్, శ్రీ పద్మావతి హాస్పిటల్ ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం 5వ జాతీయ ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలను, నేషనల్ ఫార్మకో విజిలెన్స్ వీక్ సందర్బంగా స్విమ్స్ ఓ.పి.డి బ్లాక్, శ్రీ పద్మావతి హాస్పిటల్ ఎండోక్రినాలజీ విభాగంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన స్విమ్స్ డీన్ డాక్టర్ అలోక్ సచిన్ పివిపిఐ క్యూ ఆర్ కోడ్‌ను పేషంట్ల కోసం నూతనంగా ప్రవేశపెట్టారు. ఈ క్యూఆర్ కోడ్ పేషంట్ల కోసం ముందులకు రియాక్షన్ వస్తే సులభంగా నివేదించే ప్రక్రియ అని తెలిపారు. ఫార్మకాలజీ విభాగం, ఏఎంసి డిప్యూటీ కోఆర్డినేటర్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ స్విమ్స్ సంచాలకులు ఆదేశాల మేరకు ఇండియన్ ఫార్మో కోఫియా కమీషన్ సహకారంతో స్విమ్స్ లో సెప్టెంబర్ 17వ తేదీ నుండి 23వ తేదీ వరకు ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫార్మ కాలేజీ విభాగాధిపతి, ఏ.ఎం.సి కోఆర్డినేటర్ డాక్టర్. కె. ఉమామహేశ్వరరావు సూచన మేరకు నిర్వహించమన్నారు.

జేశాప్ తిరుపతి జిల్లా నూతన అధ్యక్షుడిగా విజయ్ యాదవ్ ఏకగ్రీవ ఎన్నిక



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: రాష్ట్రంలోనే ఏకైక జర్నలిస్టు క్రీడా సంఘంగా గుర్తింపు పొందిన జేశాప్ (జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) ఉమ్మడి తిరుపతి చిత్తూరు జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది. జేశాప్ రాష్ట్ర అధ్యక్షులు రత్నాకర్, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, తిరుపతి జిల్లా ఇంచార్జ్ నరేష్ ఆదేశాల మేరకు శుక్రవారం తిరుపతి కరకంబాడి రోడ్డులోని సివి క్రికెట్ అకాడమీలో జిల్లాస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జేశాప్ గత జిల్లా కమిటీ అధ్యక్షులు తిరుపతి ఆంధ్రప్రభ పత్రిక జర్నలిస్ట్ పులుగూరు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి కాళహస్తి సాక్షి రిపోర్టర్ ఎన్.శ్రీనివాసులు సమక్షంలో పలు తీర్మానాలు చేయడం జరిగింది. ఇందులో భాగంగానే నూతన జిల్లా కమిటీని వారు ప్రకటించారు. జేశాప్ ఉమ్మడి తిరుపతి చిత్తూరు జిల్లా అధ్యక్షులుగా విజయ యాదవ్ (జీ న్యూస్), ప్రధాన కార్యదర్శిగా నారా హరిబాబు(ఆంధ్రజ్యోతి), కోశాధికారిగా నరేష్ రెడ్డి (సాక్షి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితోపాటు ఉపాధ్యక్షులుగా పి.సుబ్రహ్మణ్యం (సాక్షి), దుగ్గాని ప్రసాద్(యాక్సి) నెల్లూరు శ్రీనివాసులు (సాక్షి), ఉప కార్యదర్శులుగా కామేశ్వరయ్య(ప్రజాశక్తి), శ్రీనివాసులు (సాక్షిటీవీ), సుబ్రహ్మణ్యం (ఆంధ్రజ్యోతి), ప్రసాద్ (సాక్షి టీవీ), సీనయ్య(ఆంధ్రప్రభ) ఎన్నిక కాగా ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నాగార్జున, ప్రతాప్ కుమార్, చిన్నబాబు, మునిశేఖర్, అమర్నాథ్, విజయ్ కుమార్, మునికృష్ణారెడ్డి, భాస్కర్, లోకేష్ రాజు, సతీష్ కుమార్, తులసి రామ్, జగదీష్, మనోహర్ లు ఏకగ్రీవంగా ఎన్నికయిన వారిలో ఉన్నారు.

పెయింటింగ్ కాంపిటీషన్ నైపుణ్యతను చాటుకోండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ యోజన సేవా పర్వ్ –2025 లో భాగంగా ఈనెల 22వ తేదీన మూడు కేటగిరీలుగా పెయింటింగ్ కాంపిటీషన్స్ నిర్వహిస్తున్నట్లు ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ ప్రాంతీయ కేంద్రం రీజనల్ డైరెక్టర్ రాఘవన్ తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా జరిగిన అభివృద్ధిని ప్రజలందరికీ పూర్తిస్థాయిలో తెలియజేయడానికి ఈ కాంపిటీషన్స్ లో వికసిత్ భారత్ థీమ్ కు సంబంధించి చిత్రకళా కార్యశాలను నిర్వహిస్తున్నమన్నారు. సమాచారం కోసం 9866874963, 6303601422 ను సంప్రదించాలన్నారు.

మాపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తన తండ్రి దాన సెటిల్మెంట్ రూపంలో ఇచ్చిన భూమిని తిరిగి ఎలాగైనా తీసుకోవడానికి తమపై కొందరితో కలిసి దాడి చేశారని, దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని తిరుపతి జిల్లా పుత్తూరు మండలానికి చెందిన నీలమ్మ పోలీసు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆమె కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడారు. 1999లో తన భర్త ప్రమాదవశాత్తు మరణించడంతో, వచ్చిన ఇన్సూరెన్స్ డబ్బులను తన తండ్రి సుబ్రహ్మణ్యం, తమ్ముడు గుర్రప్పకు ఇచ్చానన్నారు. అయితే దాన సెటిల్మెంట్ ద్వారా ఇన్నాళ్ల తర్వాత పుత్తూరు కార్వేటి నగరం రోడ్డులో 36 అంకణాలతో నిర్మించిన 17/185 ఇంటిలో నివాసం ఉంటున్నామన్నారు. గత నెల 20వ తేదీన తన తండ్రి సుబ్రహ్మణ్యం, తమ్ముడు గుర్రప్ప, గుర్రప్ప భార్య సుహాసిని, వారి బావమరిది మధు, పుత్తూరు హరిజనవాడలో ఉండే గుర్రప్ప, చీరాలు, ముని కృష్ణయ్య వారికి డబ్బులు ఇచ్చి తను బలవంతంగా ఇంటిలో నుంచి ఖాళీ చేయించడానికి భౌతికంగా దాడి చేశారన్నారు. దీనిపై పుత్తూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేస్తే అక్కడి పోలీసులు తాను నిరక్షరాస్యురాలినని తెల్ల కాగితంపై సంతకాలు, వేలిముద్రలు వేయించుకొని, కేసు నమోదు చేయకుండా రాజీ పోయినారని ఉన్నతాధికారులకు విన్నవించుకున్నారు. వాస్తవంగా ఎందుకు సంతకాలు, వేలిముద్రలు చేయించుకుంటున్నారు అన్న విషయం అడిగితే పోలీసులు బెదిరింపులకు దిగారన్నారు. దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి, తనకు తానా సెటిల్మెంట్ ద్వారా వచ్చిన ఇంటి స్థలాన్ని అప్పజెప్పేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో వరలక్ష్మి, పొట్టెమ్మ, మునెమ్మ, సుబ్బమ్మ, నాగులు, గుర్రమ్మ, సుభద్రమ్మలు పాల్గొన్నారు.

డ్రగ్స్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని కళాశాలలో చదువుకునే విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని గూడూరు రెండో పట్టణ ఎస్సై సుబ్రమణ్య రాజు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం గూడూరు రెండో పట్టణ పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాల, ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాల వాడకంపై జరిగే అనర్థాలపై అవగాహన సదస్సును రెండో పట్టణ పోలీసులు నిర్వహించారు. అనంతరం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను జండా ఉత్సవానికి ముందస్తు చర్యల్లో భాగంగా బైండోవర్ చేసుకొని స్థానిక మండల మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి రెండు లక్షల రూపాయల సొంత పుచ్చి కత్తిపై విడుదల చేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ:తిరుపతి నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ చంద్రశేఖర రావు తెలిపారు. తిరుపతి పరిధిలో రాజీవ్ నగర్ సెక్షన్, ఈస్ట్ సెక్షన్, వెస్ట్ సెక్షన్, మాధవ్ నగర్ సెక్షన్, మంగళం రూరల్స్ సెక్షన్ నందు 33/11 కె.వి ఆర్.టి. ఓ 33/11 కె.వి రెడ్డి అండ్ రెడ్డి కాలని, 33/11 కె.వి గోవిందరాజుల సబ్ స్టేషన్ 33/11 కె.వి, జర్నలిస్ట్ కాలిని 33/11 కె.వి అమరావతి డి.పి.ఓ ఫీడర్లు మెయింటెనెన్స్, మరమ్మత్తులు కారణంగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగును అని, ఎస్.వి నగర్, అమరావతి నగర్, వెస్ట్ చర్చి ఏరియా, న్యూ బాలాజీ కాలని, డి.పి.ఓ ఏరియా, రెడ్డి %డ%రెడ్డి కాలని, టి.కె. స్ట్రీట్ , వి.వి. మహల్ రోడ్డు, గాంధీ రోడ్డు, చిన్న బజార్ స్ట్రీట్, జి ఎస్. మాడా విధి, జి.ఎస్. మాడా విధి, కర్నల్ విధి, ప్రకాశం రోడ్డు, జర్నలిస్ట్ కాలిని , శివజ్యోతి నగర్, సత్య నారాయణపురం, వెంకటేశ్వర కాలని, బి.టి. ఆర్ కాలని, ఆర్. టీ. ఓ. ఆఫీసు, బొమ్మల క్వార్టర్స్ %డ% తుడ క్వార్టర్స్ తదితర పరిసర ప్రాంతాల వినియోగ దారులు సహకరించాలని కోరారు.

మహిళల సమస్యలను తీర్చడమే జెండర్ రిసోర్స్ సెంటర్ ముఖ్య ఉద్దేశం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మహిళా సమస్యలను తీర్చడమే జెండర్ రిసోర్స్ సెంటర్ ముఖ్య ఉద్దేశమని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఏపీ డిపి ప్రభావతి తెలిపారు. నారాయణవనం మండలం, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జెండర్ రిసోర్స్ సెంటర్‌ని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఏపీడి ప్రభావతి. చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల సమస్యలు పరిష్కరించేందుకు జెండర్ రిసోర్స్ సెంటర్ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఎం వెంకటేష్, ఏపిఎంలు టి. ధనుంజయ రెడ్డి, ద్రాక్షాయిని సీసీలు నాగేంద్ర, అరుణ్ కుమార్, రాజేశ్వరి, నిమ్మి అకౌంటెంట్ మల్లిక, వి ఓ ఏ లు పాల్గొన్నారు.

స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం

ప్రజాశక్తి - చంద్రగిరి:చంద్రగిరి మండలం, తొండవాడలో శుక్రవారం స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభి యాన్ (మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యమానికి ముఖ్యఅతిగా తొండవాడ సర్పంచ్ దీపికా రెడ్డి హాజరయ్యారు. డాక్టర్ శిరీష పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. వైద్య సిబ్బంది పరీక్షలు చేసి అవసరం అయిన వారిని మెరుగైన వైద్యంకోసం చంద్రగిరి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు పంపారు. ఈ కార్యక్రమంలో, ఉమాపతి రెడ్డి, మోహన్ రెడ్డి, డాక్టర్ కుసుమ తదితరులు పాల్గొన్నారు.

ఆనందవల్లి అమ్మవారికి వెండి పాదాలు బహుకరణ

ప్రజాశక్తి -ఏర్పేడు : గుడిమల్లం శ్రీ పరశురామేశ్వర స్వామి సేవలో నాగరాజు వారి కుటుంబ సభ్యులు ఆనందవల్లి అమ్మవారికి 318 గ్రాముల వెండి పాదాలు అందజేశారు. వారికి ఆలయ మర్యాదలతో ఆలయ మాజి చైర్మన్ బత్తలగిరి నాయుడు, కార్యనిర్వాహణాధికారి రామచంద్రారెడ్డి లు ఆలయ అర్చకులతో ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందించారు.



వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :గూడూరు, ఓం శ్రీ వృద్ధాశ్రమంలో కృపా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రుద్రరాజు సుధీర్ పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులు దాతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా కృప సేవ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కటకం శ్రీనివాసులు మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలు వాళ్ల కుటుంబ సభ్యుల నడుమ ఎక్కువగా చేసుకుంటూ ఉంటారు, కానీ ఈరోజు పుట్టినరోజు జరుపుకుంటున్న రుద్రరాజు సుధీర్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేసి పుట్టినరోజు వేడుకలు చేసుకున్న రుద్రరాజు సుధీర్‌కు, వారి కుటుంబ సభ్యులకు కృప సేవ చారిటబుల్ ట్రస్ట్ తరపున ధన్యవాదాలు తెలిపారు. సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమానికి కృప సేవ చారిటబుల్ ట్రస్ట్ మా వంతు చేయూత అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కటకం శ్రీనివాసులు, జాయింట్ సెక్రెటరీ పేయ్యల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలింతలకు అవగాహన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :గూడూరు, ఐ.సి.డి.ఎస్ ఆధ్వర్యంలో గాంధీనగర్ సెక్టార్, కొండగుంటలో శుక్రవారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ.సి .డి.పి.వో శారదాంబ మాట్లాడుతూ బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. గ్రామంలో పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐ.సి.డి.ఎస్ సూపర్వైజర్ స్వరూప రాణి, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో అరాచక శక్తులను అణచివేయాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: పుణ్యక్షేత్రం తిరుపతిలో రౌడీలు, అరాచక శక్తులను అణచివేయాలని టిడిపి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ బి సుధాకర్ రెడ్డి జిల్లా ఎస్పీకి శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. నగరంలో దిగజారుతున్న శాంతి భద్రతల వల్ల కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందన్నారు. గురువారం రాత్రి ఆరుగురు ఆకతాయిలు తాగి నడి రోడ్డుపై ఓ తల్లీ కూతుర్ని వేధించడం చూస్తే పోలీసులు, చట్టాలు అంటే రౌడీలకు భయం పోయిందన్న భావం కలుగుతోందన్నారు. పోలీసులకు పట్టుబడిన ముగ్గురు రౌడీల వెనక ఉన్న రాజకీయ శక్తులను బయట పెట్టాలని డిమాండ్ చేశారు. అరాచక శక్తులు, అవినీతిపరుల వ్యవహారాలను యువత సోషల్ మీడియాలో ఎండ గట్టాలని సూచించారు.

జోనల్ స్థాయి క్రీడా పోటీలకు 163 మంది ఎంపిక

ప్రజాశక్తి - రామచంద్రాపురం: జోనల్ స్థాయి క్రీడా పోటీలకు 163 మంది విద్యార్థులు ఎంపికైనట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల కోఆర్డినేటర్ శివకుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కుప్పం బాదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి భార్గవి, పీడీలు గోపీనాథ్, గోవిందరాజులు, దేవరాజులు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కోట: కోట మండలంలోని తీర ప్రాంత గ్రామాలైన గోవిందపల్లి పాలెం నందు మత్స్యకారులకు కమ్యూనిటీ అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం మెరైన్ పోలీసు వారి ద్వారా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మెరైన్ సీఐ వెంకటేశ్వర్ రెడ్డి,కోట తహశీల్దార్ కటారి.జయ జయ రావు,ఎంపీడీవో దిలీప్ కుమార్ నాయక్,మత్స్యశాఖాధికారి రెడ్డి నాయక్, స్థానిక ఎస్సై పవన్ కుమార్,మెరైన్ ఎస్ఐ శివ సౌమ్య,ఫారెస్ట్ డిపార్ట్మెంట్ సిబ్బంది హాజరయ్యారు. అనంతరం తహశీల్దార్ కే.జేజే రావు మాట్లాడుతూ ఫిషరీస్ కమ్యూనిటీ వారికి ఫిషింగ్ సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అనే విషయాలపై క్షుణ్ణంగా వివరించారు. అంతేకాక ఏమేమి అవసరాలు గ్రామానికి ఉన్నాయో అడిగి తెలుసు కుని వాటిని పరిష్కరించే దిశగా పైస్థాయి అధికారులకు నివేదికను పంపబడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కోట ఎంపిడిఓ దిలీప్ కుమార్,గ్రామస్థులు పాల్గొన్నారు.

మద్యం బాబులపై కఠినమైన చర్యలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: గురువారం రాత్రి తిరుపతి లీలామహల్ జంక్షన్ వద్ద ముగ్గురు యువకులు మద్యం మత్తులో ఇద్దరు మహిళలను వేధించిన ఘటన వెలుగులోకి వచ్చింది. స్థానికుల సమాచారంతో అలిపిరి పోలీస్ స్టేషన్ సిబ్బంది వెంటనే స్పందించి, అక్కడికి చేరుకొని ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. అభ్యంతరకర ప్రవర్తనకు పాల్పడిన ముగ్గురు యువకులు చందు, హరి, శివలను పోలీసులు అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. రూ.5,00,000/- బాండ్‌పై మేజిస్ట్రేట్ సమక్షంలో బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు మాట్లాడుతూ మహిళలను వేధించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే, వారు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబడరని హెచ్చరించారు.